క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప పడిపూజ


పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

పార్వతీపురం: మండలంలోని సంగంవలసలో అయ్యప్ప భక్తులు స్వామివారి పడిపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని బడే బలరాం ఇంట్లో అయ్యప్పలు పూజలు, భజనలు చేశారు. దుష్టశక్తులను సంహరించేందుకు అయ్యప్పస్వామి ఉపయోగించిన 18 ఆయుధాలను 18 మెట్లుగా భావించి మెట్లకు పూజలు చేశారు. 41 రోజుల పాటు చన్నీటితో స్నానం చేసి ఒక పూట ఆహారం తీసుకొని భక్తి శ్రద్ధలతో అయ్యప్పను కొలిచి శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లనున్నారు.

పోరాటమే సమస్యలకు పరిష్కారం

పార్వతీపురంటౌన్: స్థానిక జూనియర్ కళాశాలలో యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ సంబరాలను ఆదివారం నిర్వహించారు. డీఈఓ కార్యాలయం నుంచి జూనియర్ కళాశాల వరకు ఉపాధ్యాయులు ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రమేష్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కేఎస్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోరాటాలే సమస్యలకు పరిష్కారమని నమ్మిన సంఘం యూటీఎఫ్ అన్నారు. ప్రభుత్వాలు విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేస్తున్నాయన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరావు మాట్లాడుతూ కాంట్రాక్టీకరణ విద్యారంగంలో ఎక్కువ అయిందని, ఇది సరికాదన్నారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులను, లెక్చరర్లను, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మినిమమ్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎ.భాస్కరరావు, జిల్లా సహాధ్యక్షుడు బి.విజయకుమార్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కురుపాంలో సీపీఎం జిల్లా మహాసభలు


జిల్లా మహాసభల పత్రికను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సీపీఎం జిల్లా మహాసభలను వచ్చే నెల 10, 11 తేదీల్లో కురుపాంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు వెల్లడించారు. కురుపాం మండలం డి.బారామణి గ్రామంలో సీపీఎం మండల కమిటీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతాంగ పోరాట గడ్డ కురుపాం మండల కేంద్రంలో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహించాలని జిల్లా కమిటీ నిర్ణయించిందని, జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన నాయకత్వం, జిల్లా నాయకత్వం హాజరౌతారని తెలిపారు. 1993లో జిల్లా మహాసభలు ప్రారంభంలో గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించడం జరిగిందని, మరలా అదే స్ఫూర్తితో కురుపాంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గోడ పత్రికలు, కరపత్రికలు విడుదల చేశారు.

మాటలేనా మంత్రిగారు?

- ఐదు నెలలు అయినా అమలు కాని హామీలు
- కార్యరూపం దాల్చని మంత్రి తొలి సంతకం
- మంత్రి ఆదేశించిన 11వ వార్డులో పరిష్కారానికి నోచుకోని తాగునీటి సమస్య
- కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు తప్పని కష్టాలు

సాలూరు:

హైదరాబాద్‌కు సముద్రాన్ని తీసుకువస్తాం అంటూ ఓ సినిమాలో రాజకీయ నాయకుడు ఇచ్చిన హామీని తలపించేలా కూటమి నేతల హామీలు అమలు ఉందంటూ పలువురు ప్రజలు మాట్లాడుకుంటున్నారు. జీగిరాం జ్యూట్‌ఫ్యాక్టరీ తెరిపిస్తాం, దేశంలోనే అతితక్కువ పన్నులు విధించి లారీ పరిశ్రమను ఆదుకుంటాం, జీవో 3 ద్వారా గిరిజనులకు న్యాయం చేస్తాం, 16 రకాల సంక్షేమ పథకాలు గిరిజనులకు అందిస్తాం, పెద్దగెడ్డ పనులు పూర్తిచేస్తాం .. తదితర హామీలను ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికా


తెరుచుకోని జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీ

రంలోకి వచ్చిన తరువాత స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖామంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన గుమ్మిడి సంధ్యారాణి ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకంపై తొలి సంతకం చేశారు. మున్సిపాలిటీకి సంబంధించి సామాజిక మరుగుదొడ్ల మరమ్మతులు చేపడతామని, వివిధ హామీలు పలు సందర్భాల్లో తెలిపారు. ఆమె మంత్రిగా జూలై 12న ప్రమాణ స్వీకారం చేసి మూడు నెలలు దాటి మరో పది రోజుల్లో నాలుగు నెలలు కావస్తున్న నేపథ్యంలో ఆమె ఇచ్చిన హామీలెన్ని అమలయ్యాయంటే సమాధానం కరువవుతున్న పరిస్థితి కనిపిస్తుంది.

నెలలుదాటుతున్నా.. కార్యరూపం దాల్చని తొలి సంతకం?

మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సంధ్యారాణి ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకంపై తొలి సంతకం చేశారు. కానీ ఇంతవరకు ఆ దిశగా అడుగులు పడిన దాఖలాలు లేవు. పైగా ఈ కూటమి పాలనలో గిరిజన నియోజకవర్గాల్లో ఆశ్రమ పాఠశాలల్లో పలువురు విద్యార్థులు అనారోగ్యాలతో మరణించిన విషయం పాఠకులకు విదితమే. సంధ్యారాణి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, నాడు మంత్రులుగా రాజన్నదొర, పుష్పశ్రీవాణి పనిచేసినప్పుడు మీ పాలనలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు చనిపోతున్నారు, మీరు ఏం చేస్తున్నారంటూ పలు విమర్శలు చేశారు. మరి నేడు ఆమె మంత్రిగా ఉంటూ చేసిన తొలిసంతకం నేటికి కార్యరూపం దాల్చని పరిస్థితి లేదు.

రెండు రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కారం చేశారా?

కాగా ఇటీవల వంద రోజుల పాలన పూర్తయిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి పట్టణంలో 11వ వార్డులో సెప్టెంబరు 22న పాల్గొన్నారు. నాడు వార్డులో తాగునీటి, సామాజిక మరుగుదొడ్ల సమస్యలను స్థానికులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. రెండు రోజుల్లోనే తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆమె మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. నెలలు గడుస్తున్నా.. నేటికి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు.

ఆత్మగౌరవం హామీలు అమలయ్యేదెప్పుడు?

'నేను ఎన్నికల ప్రచారం సమయంలో పట్టణంలోని అన్ని వార్డుల్లో తిరిగాను. సామాజిక మరుగుదొడ్లు పూర్తిగా మూలకు చేరాయి. మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి ఆత్మగౌరవం దెబ్బతింటుంది' అంటూ మంత్రి అయిన తరువాత పలు సందర్భాల్లో సంధ్యారాణి పేర్కొన్నారు. ఇదే క్రమంలో వారం రోజుల్లోగా సామాజిక మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ అధికారులను మంత్రి హోదాలో ఆమె ఆదేశించారు. నిధులు కొరత ఉందని అధికారులు తెలపగా తాను కలెక్టర్‌తో మాట్లాడానని, మీరు ఫైలు పెడితే నిధులు విడుదలవుతాయని ఆమె మున్సిపల్ సమావేశంలో చెప్పారు. వారం రోజుల్లో పూర్తికావాలని ఆమె ఆదేశించారు.


మూలకు చేరిన పట్టణంలో సామాజిక మరుగుదొడ్లు

నెలలు గడుస్తున్నా నేటికీ పనులు పూర్తికాలేదు.

యువగళం హామీలు అమలైతే ఒట్టు

యువగళంలో భాగంగా నారా లోకేష్ పట్టణంలో బహిరంగ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సూపర్‌సిక్స్ పథకాలతో పాటు, ముఖ్యంగా జీగిరాం జ్యూట్‌ఫ్యాక్టరీ తెరిపించి కార్మికులను ఆదుకుంటామని, దేశంలో అతితక్కువ పన్నులు లారీలకు విధించే బాధ్యత నేను తీసుకుంటానని, జీఓ 3 ద్వారా గిరిజనులకు న్యాయం చేస్తామని, సుమారు 16 సంక్షేమ పథకాలు గిరిజనులకు ఇస్తామని, ఐటీడీఏలను బలోపేతం చేస్తామని, తదితర హామీలు ఇచ్చారు. నేటి వరకు ఆ హామీలు అమలుకు నోచుకోలేదు. ఐటీడీఏలో రెగ్యులర్ పీఓ, రెగ్యులర్ డీడీ నియామకం కూడా జరగలేదు.

ఈ కూటమి పాలనలో ఏ పథకం ఎప్పుడు అమలు చేస్తారో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేయలేదని, ఉద్యోగాల కల్పనకై జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని, అసలు బడ్జెట్‌నే ప్రవేశ పెట్టలేదని పలువురు నిట్టూరుస్తున్నారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తప్పక అమలు చేయాలని కోరుతున్నారు. కాగా ఈ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ప్రతిపక్షాలపై కక్షపూరితంగా దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలతో రెడ్ బుక్ రాజ్యాంగమే అమలవుతుందని పలువురు ప్రజలు చర్చించుకుంటున్నారు.

108కు సుస్తీ


మరమ్మతుకు గురైన 108 వాహనం

సీతానగరం: అత్యవసర పరిస్థితుల్లో రోగులు, క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలించి వారి ప్రాణాలను కాపాడే 108 వాహనానికి సుస్తీ చేసింది. వాహన నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మూలకు చేరింది. దీంతో మండల ప్రజలకు అత్యవసర సమయంలో 108 సేవలు అందక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు దీనిపైదృష్టి సారించాలని, వాహనానికి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

జమిలీ ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

గుమ్మలక్ష్మీపురం: జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యం, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని, జమిలీ ఎన్నికల విధానాన్ని సీపీఎం(ఎం) పూర్తిగా వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో పార్టీ నాయకులు కోలక అవినాష్, మండంగి రమణతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక ద్వారా ఒకే నాయకుడి సారథ్యంలో ఉండే ఏకీకృత రాజ్య వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆర్ఎస్ఎస్, బీజేపీలు కోరుకుంటున్నారని విమర్శించారు. ఒకే దేశం, ఒకే మతం, ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే నాయకుడు అన్న నినాదానికి ఇది కొనసాగింపు మాత్రమేనని, ఇది బీజేపీ ఫాసిస్టు దృక్పథాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రజాస్వామ్యం, సమాఖ్య విధానాన్ని కోరుకునే ప్రతీ పార్టీ దీన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు.

అక్షయపాత్ర నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి


కలెక్టరేట్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురం: గిరిజన ఆశ్రమ పాఠశాలలకు, వసతి గృహాలకు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా ఆహారం సరఫరా చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ గేటు వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల దీక్షలు ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకుడు వెంకటరమణ మాట్లాడుతూ షరతులను చూపించి విద్యార్థులకు అందించే సంక్షేమ పథకాల్లో కోతలు విధిస్తున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రాజు, డి.పండు మాట్లాడుతూ వసతిగృహాల్లోనే వంటలను తయారు చేసి వేడివేడి పదార్థాలను విద్యార్థులకు అందించాలన్నారు. అక్షయపాత్ర ద్వారా ఆహారం సరఫరా చేస్తే ఇబ్బందులు తప్పవన్నారు. పౌష్టికాహారం సక్రమంగా అందక విద్యార్థులు రక్తహీనతతో ఇబ్బందులు పడుతున్నారని, మెనూ సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా ఆహారాన్ని సరఫరా చేయడం అంటే ప్రభుత్వం తమ బాధ్యతల నుంచి తప్పుకోవడమే అని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్తీక స్నానాలకు వీలుగా..


బుడ్డిపేట రేవు వద్ద చెత్తపోగులను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

సీతానగరం: కార్తీక మాసంలో భక్తులు వేకువజామున నదీ స్నానాలు ఆచరించి తీరంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో నదీతీర గ్రామాల్లో రేవులను, రేవుకు వెళ్లే దారులను పంచాయతీ పాలకులు బాగుచేస్తున్నారు. భక్తులు వేకువజామున నిర్భయంగా నదికి వెళ్లి స్నానాలు ఆచరించేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సువర్ణముఖి నదిని ఆనుకుని ఉన్న సీతానగరం, తామరఖండి, బళ్లకృష్ణాపురం, గెడ్డలుప్పి, బగ్గందొరవలస, బూర్జ, అకంలాం గ్రామాల్లోని రేవుల వద్ద పేరుకుపోయిన చెత్తకుప్పలను యంత్రాలతో తొలగించే పనులు చేస్తున్నారు. పెదబోగిలి పంచాయతీ పరిధిలో ఉన్న బుడ్డిపేట, సీతానగరం, మెట్టువీధి, గూడెంవీధి రేవులలో చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు విద్యుత్ వీధిదీపాలు ఏర్పాటు చేస్తున్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత


పార్వతీపురంటౌన్: ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై పాపయ్య

పార్వతీపురంటౌన్: నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం ద్వారానే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ట్రాఫిక్ ఎస్సై పాపయ్య అన్నారు. పట్టణంలోని నాలుగురోడ్ల కూడలి వద్ద రహదారి భద్రతపై ఆదివారం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు తప్పనిసరిగా రహదారి భద్రతా నియమాలు తెలిసి ఉండాలన్నారు. ఆటోలకు అన్ని అర్హత పత్రాలు తప్పనిసరని తెలిపారు. పట్టణంలోని ముఖ్య కూడళ్లలో ఆటోలను క్రమపద్ధతిలో నిలపాలని సూచించారు. ఆర్టీసీ కాంప్లెక్సు, పాత బస్టాండ్, సౌందర్య జంక్షన్, బెలగాం వద్ద ఆటోలను అస్తవ్యస్తంగా నిలపడం వల్ల ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించవద్దని, డ్రైవర్ సీటులో ప్రయాణికులను కూర్చోబెట్టవద్దన్నారు. ఆటోల్లో ప్రయాణించే మహిళల పట్ల కొంతమంది ఆటో డ్రైవర్లు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చిందని, ఇటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఆటో డ్రైవర్లు స్వస్తి పలకాలన్నారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లకు ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. నిబంధనల ప్రకారం ఆటో డ్రైవర్లు నడుచుకొని పోలీసులకు సహకరించాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి


చినభోగిలి జంక్షన్ వద్ద వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. మండలంలోని చినభోగిలి జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం వాహణ చోదకులకు రోడ్డు భద్రత నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి, అతివేగంతో వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్, ఫోర్‌వీల్ వాహనాలు డ్రైవింగ్ చేస్తున్న వారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల సంచారంపై స్థానిక మహిళా పోలీసుకు సమాచారం ఇవ్వాలని కోరారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు కార్తీక శోభ


పంచముఖేశ్వరస్వామి ఆలయం, ఇన్‌సెట్‌లో స్వామివారు

సాలూరు:

కార్తికమాసం ప్రారంభం కావడంతో శైవక్షేత్రాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. నిత్యం భక్తులతో కళకళలాడుతున్నాయి. సాలూరు పట్టణంలోని పంచముఖ క్షేత్రంతో పాటు పాచిపెంట మండలంలోని మంచాడవలస గ్రామ సమీపంలో గుహలో వెలసిన గోకర్ణేశ్వరస్వామి ఆలయం, పారమ్మ కొండపై ఉన్న శివాలయాలకు దశాబ్దాల ప్రాశస్త్యం ఉంది. ఆయా ఆలయాలను దర్శించుకునేందుకు భక్తులు క్యూ కడుతున్నారు.

అరుదైన పంచముఖేశ్వర లింగం

పట్టణంలోని పంచముఖాలతో కూడిన శివలింగం దేశంలోనే అరుదైనదిగా ప్రశస్తి పొందింది. నేపాల్‌లోని పశుపతినాథ్ ఆలయంలో మాత్రమే ఈ తరహా రూపంలో పరమేశ్వరుడు దర్శనమిస్తాడని భక్తులు చెపుతుంటారు. దాదాపు 400 ఏళ్ల కిందట తపోవనంగా పేరొందిన సాలూరు గ్రామ సమీపంలో సాధువులు తపస్సు చేస్తుండేవారట. వారు కాశీ యాత్రకు వెళ్లి అక్కడ గంగానదిలో స్నానమాచరిస్తుండగా కాళ్లకు పంచముఖ రూపంలోని శివలింగం తగిలింది. దాన్ని సాలూరు గ్రామంలో ప్రతిష్ఠించాలని భావించిన సాధువులు ఎడ్లబండిపై ఇక్కడకు తీసుకువస్తుండగా.. సాలూరు పొలిమేరకు నుంచి దాన్ని తరలించడం సాధ్యం కాలేదు. దీంతో అక్కడే ఈ లింగాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణంలో నిర్మించిన భవతారిణి పుష్కరిణిలో దేశంలోని నలుమూలల ఉన్న ప్రసిద్ధ నదీజలాలను సేకరించి నింపారు. ఆలయ దక్షిణ, తూర్పు దిక్కుల గుండా వేగావతి నది ప్రవహించడం మరో విశిష్టతగా భక్తులు భావిస్తుంటారు. ఈ గుడి చుట్టూ కొన్ని ఎకరాల్లో తోటలు ఉన్నాయి. అందులో సంచరిస్తున్న పాములు మునిశాపం వల్ల ఈ ప్రాంతంలో ఎవ్వరిని కాటేయవని భక్తుల విశ్వాసం. కార్తిక మాసం సోమవారాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు ఈ ఆలయానికి తరలివచ్చి పూజలు చేస్తుంటారు.

గుహలో వెలసిన గోకర్ణేశ్వర స్వామి



మంచాడవలస గుహలో వెలసిన శివలింగం

పాచిపెంట మండలంలోని మంచాడవలస గ్రామ సమీపంలో గుహలో వెలసిన శివలింగం గోకర్ణేశ్వర స్వామి ఆలయంగా ప్రాశస్త్యం పొందింది. కొండపై ఉన్న ఈ గుహలోకి వెళ్లేముందు 18 అడుగుల నంది విగ్రహం దర్శనమిస్తుంది. అక్కడే 28 అడుగులు ఉన్న శివుని విగ్రహం ఉంటుంది. పెద్ద ఆంజనేయుడు చేతిలో శివలింగంతో దర్శనమిస్తాడు. గుహ ప్రవేశమార్గం పెద్ద ఏనుగు తల ఆకారంలో ఉంటుంది. గుహలోకి కొంత దూరం వంగొని భక్తులు వెళ్లాల్సి ఉంటుంది. అలా కొంత దూరం వెళ్లిన తరువాత భక్తులకు శివలింగం, నంది విగ్రహం, వినాయక విగ్రహాలు దర్శనమిస్తాయి. సాలూరు, పాచిపెంటలతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు అధికంగా ఈ ఆలయానికి వస్తుంటారు.


వైద్యనాథుడుగా పేరొందిన శివలింగం

పారమ్మకొండ ప్రత్యేకం

సుమారు కి.మీ. ఎత్తు ఉన్నట్లుగా భావించే శివలింగాకారంలో ఉండే పారమ్మ కొండపై 36 చేతులతో ఆయుధాలు ధరించి శిరస్సుపై శివుడిని కలిగి ప్రత్యేకంగా ఉండే అమ్మవారి విగ్రహాన్ని మొదటగా దేవతలు సుమారు 2400 సంవత్సరాలు క్రితమే ప్రతిష్ఠించారని భక్తుల కథనం. ఇక్కడ గుహలోనే పాండవులు వనవాసం ఉండేవారని, ఆ సమయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి మహాశివునికి ప్రత్యేక పూజలు చేసారని నమ్మకం. దీనికి ప్రతీకగా పాండవుల గుహలో శివలింగానికి పూజలుచేస్తున్న పాండవుల విగ్రహాలు ఓ గుహలో ఉన్నాయి. ఈ కొండపై వెలసిన స్వయంభు శివలింగం ఉండగా ఆ సమీపంలో రాష్ట్రంలో అతి పెద్ద శ్రీచక్రం ప్రతిష్ఠించబడింది. శక్తి ఆలయాలు, వివిధ దేవతా మూర్తులు విగ్రహాలు ప్రతిష్ఠించి ఉన్నాయి. కార్తిక మాసం నాలుగో సోమవారం జరిగే శివపార్వతుల కళ్యాణంకు ఆంధ్రా, ఒడిశా నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు చేస్తుంటారు. పారమ్మ కొండకు ముందే పొలాల్లో వైద్యనాథుడిగా పేరొందిన స్వయంభు శివలింగం ఉంది.


పారమ్మకొండపై గుహలో వెలసిన శివలింగం


పారమ్మకొండపై ఉన్న శ్రీచక్రం

రాజకీయ కక్షతో పింఛన్ల నిలుపుదల


పింఛన్లు ఇవ్వకుండా ఆపేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

బలిజిపేట: రాజకీయ వేధింపులతో టీడీపీ నేతలు పింఛన్లు తొలగిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. మండలంలోని నారన్నాయుడువలస గ్రామంలో చల్ల పాపమ్మ(లెప్రసీ), కంది గౌరీశంకరరావు(దివ్యాంగుడు),తో పాటు వృద్ధులు లండ సింహాచలం, బి.సింహాచలం, నాగళ్ల అప్పడు, చిన్ని అప్పలనరసయ్య, కొప్పిశెట్టి పారయ్యలకు పింఛన్లు నిలిపివేశారు. 8 సంవత్సరాలుగా పింఛన్ తీసుకుంటున్నామని, కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛన్ డబ్బుల కోసం ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీనెల పింఛన్ ఇచ్చే సమయంలో మీకు పింఛన్ డబ్బులు ఇవ్వవమని, మీ ఇష్టం వచ్చినచోట చెప్పుకోండని వేధిస్తున్నారన్నా రు. ఈ నెల పింఛన్ డబ్బులను రెండు రోజులైనా ఇంకా ఇవ్వలేదని, దీనిపై అడిగితే ఎంపీడీఓ చెపితేనే ఇస్తామని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గోవింద్ చెప్పారని వాపోయారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులమనే తమపై రాజకీ య వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై ఎంపీడీఓ విజయలక్ష్మి వివరణ కోరగా.. రెండు నెలల క్రితం వారంతా పింఛన్లు పొందేందుకు అనర్హులుగా వచ్చిందని, అయినప్పటికీ గత రెండు నెలల నుంచి వారికి పింఛన్లు వచ్చేస్తున్నాయని, వాటిని వారికి చెల్లించడం జరిగిందన్నారు. అయితే ఈనెల కూడా అదేవిధంగా పింఛన్లు వచ్చాయని, వాటిని చెల్లించమని చెప్పినా కాని వెల్ఫేర్ అసిస్టెంట్ ఇవ్వకుండా వాటికి సంబంధించి లెటర్ ఇస్తే ఇస్తామని నాకు చెప్పడం జరిగింది. అంతేకాక ఆపింఛన్లు ఎంపీడీఓ లాగిన్‌లో కనిపించలేదన్నారు. దీనిపై ఎంపీడీఓ విజయలక్ష్మి వివరణ కోరగా.. రెండు నెలల క్రితం వారు పింఛన్లు పొందేందుకు అనర్హులుగా వచ్చిందని, అయినప్పటికీ రెండు నెలలుగా వారికి పింఛన్ డబ్బులు విడుదల అయ్యాయని, వాటని చెల్లించడం జరిగిందన్నారు. అయితే ఈనెల కూడా అదేవిధంగా రావడం జరిగింది, వాటిని వారికి చెల్లించమని చెప్పినా వెల్ఫేర్ అసిస్టెంట్ ఇవ్వకుండా వాటికి సంబంధించిన లెటర్ ఇస్తే ఇస్తానని నాకు చెప్పడం జరిగింది. అంతేకాక ఆ పింఛన్లు ఎంపీడీఓ లాగిన్‌లో కనిపించలేదన్నారు.